

# కాలమ్ దాటని కబుర్లు

## బలభద్రపాత్రుని రమణి



## నెల నెలకీ కొన్ని కులాసా కులాసా కబుర్లు

# తాళం వేసి గొళ్ళెం మరచిన మహానుభావుడు!



***పుట్టింది పాలకొల్లు***

***విరియించె నవ్వుల జల్లు***

***ఆయనే రామలింగయ్య అల్లు***

***హాస్యానికి ఆయన పుట్టిల్లు.***

అక్టోబరు 1, 1922 లో పాలకొల్లులో ఈ పద్మం ఉదయించింది. ఆనాడు ఆంధ్రదేశాన ఎన్నో 'స్టార్స్'కీ మెగాస్టార్స్‌కీ ఆద్యుడు ఉదయించాడన్న విషయం అప్పుడు తెలీదు!

నవ్వుల అల్లు ప్రస్థానం పుట్టిల్లుతో 1953లో ప్రారంభం అయి ... 2003 లో హాస్యానికి చివరసారిగా 'జై' కొట్టింది. తెలుగువారి నవ్వులకి తాళము వేసి గొళ్ళెము మరిచితిరి!

"రక్ష ఇది రక్ష ఇది పరమం పవిత్రం" అంటూ ఉత్తర కుమారుడికి శాంతి చేసి, "శాస్త్రీ, శర్మ" అంటూ వంగర వారితో కలిసి విడిదిలో వియ్యాలవారిని ఆట పట్టించ ప్రయత్నించి, కంబళి - గింబళి, తల్పం గిల్పం సీన్‌లో నవ్వించి, మమ్మల్ని చిన్నప్పుడు సినిమా హాల్లో సీట్లలోంచి కింద పడవేసిన అల్లరి విరిజల్లు! మాయాబజార్‌లో నటించిన కలికితురాయిల్లో ఈయనొకరు.

ముత్యాల ముగ్గులో కోతి కరిచిన జోగినాధం కోతి చేష్టలు.. ఏ తెలుగు ప్రేక్షకుడైనా మరిచిపోగలడా? "ఏం జోగినాధం? కొత్తద్రామానా?" అనగానే, ఒక్కసారిగా కుర్చీ మీద నుండి గెంతి, పళ్ళు చూపించి, కళ్ళు చిట్లించి, కుప్పి గెంతులేసి ఒప్పించిన ఆ అభినయ కౌశలం ఎవరికైనా పట్టుబడేనా?

యమగోలలో భూలోకానికొచ్చి "కడుపులో నాకు రెండు మాదిరలుగా అవుతున్నది ప్రభూ!" అని హోటల్‌లో భోజనం చేసి, బాత్ రూంలో చాక్‌లేట్ అనుకుని సబ్బు తిన్న చిత్రగుప్తుడుగా, హాస్యలోకానికి మనని షికారు తీసుకెళ్ళారు.

మన ఊరిపాండవులులో లక్క ఇంటిలో చనిపోయిన పాండవుల్లా, ఐదుగురినీ తగలబెట్టాను అనుకుని, ఆవకాయ అన్నం కలుపుకుని తింటుంటే, పక్కనుండి వచ్చిన వారి చేతులు చూసి, భయంతో బిగిసి, ఆశ్చర్యంతో కొయ్యబారి, దుఃఖంతో మాటరాక ఆయన చూపిన అభినయానికి ఇంకొక ప్రత్యామ్నాయం ఉందా?

ఎవరినైనా గౌరవించాలంటే నూట పదహార్లు ఇస్తాం. సన్మానించాలంటే వెయ్యి నూట పదహార్లు ఇస్తాం! ఈయన 'హాస్య బ్రహ్మ' కదా అందుకే వెయ్యి పదహారు సినిమాలు మన తెలుగువారికి కానుకగా ఇచ్చారు.

మన జాతి గౌరవాన్ని నిలబెట్టే ఒక స్వాతంత్ర సమరయోధుడూ, రూపాయి పుచ్చుకోకుండా తోటి మానవాళికి సాయపడిన ఓ హోమియోపతీ వైద్యుడూ, ప్రజల కోసం కళను అంకితం చేసిన ప్రజా నాట్యమండలి సభ్యుడూ, ఎన్నో సామాజిక సేవా కార్యక్రమాలకి విరాళాలిచ్చి సేవ చేసిన అభ్యుదయవాదీ ఆయనలో ఉన్నారు.

***ఒక మనిషి గురించి తెలుసుకోవాలంటే అతని శత్రువులని అడిగి తెలుసుకోవాలి. ఎందుకంటే వారే అతన్ని అందరికన్నా ఎక్కువ జ్ఞాపకం చేసుకుని, కనిపెడుతూ ఉంటారు!*** అలాంటి వారు ఒక్కరు కూడా లేని 'అజాత శత్రువు' ఆయన! కానీ అల్లువారు సెట్లో, స్క్రిప్ట్ విషయంలో గొడవ పడి, తనకి నచ్చని డైలాగు పలికేవారు కాదుట! రాజీ పడని విలువలు గల నటుడు ఆయన. మంచి ఫార్మ్‌లో ఉన్నప్పుడు కూడా పారితోషికం పెంచని సహృదయశీలి అల్లురామలింగయ్యగారి గురించి పరుచూరి గోపాలకృష్ణ గారు మాటల్లో ఇలా చెప్పారు.

"అనురాగబంధం" అనే సినిమా మేం ఇండస్ట్రీకి వచ్చిన కొత్తల్లో, తాతినేని రామారావుగారు డైరెక్ట్ చేస్తుండగా, తొలిసారిగా రామలింగయ్య గారిని చూసాను. అందులో ఒక డైలాగు చదివి, "ఇది నేను చెప్పను" అని రామలింగయ్యగారు పేచీ పెట్టుకున్నారు. అది "క్లీనర్ నా కొడకా!" అనే డైలాగు. ఆయనలో ఉన్న అభ్యుదయవాదీ, సంస్కారీ ఆ డైలాగ్ చెప్పడానికి ఇష్టపడలేదు.

తాతినేని రామారావుగారు ఈ విషయం ఎన్.టి.రామారావుగారికి చెప్పారు. షూటింగ్ ఆగిపోయింది. ఎన్.టి.ఆర్.గారు అల్లుగారిని పిలిచి "వారు ఇండస్ట్రీ కొచ్చిన కొత్త రైటర్లు జనసామాన్యంలో ఉన్న వాడుక భాషనే ప్రయోగించారుట.. మేమూ అడిగాం, సమాధానపడ్డాం" అన్నారుట.

అల్లుగారు మాత్రం సమాధానపడలేదు. "కొత్త కొత్త రైటర్లొచ్చి ఇండస్ట్రీలో బూతులు రాస్తున్నారు" అని మేం వినేటట్లుగా మాటలు విసిరారు.

ఆ తరువాత ఆయన విజయవాడలో 'ఈ చరిత్ర ఏ సిరాతో' సినిమా మొదటి ఆట చూసి, క్రింద సంభాషణలు పరచూరి బ్రదర్స్ అని చదివి, ఇంటికి రాగానే రాత్రి తొమ్మిది గంటలకి ట్రంకాల్ బుక్ చేసారు. అది అర్ధరాత్రి పన్నెండున్నరకి వచ్చింది. "నేనయ్యా.. అల్లురామలింగయ్యని" అవగానే, కొంచెం భయం వేసింది. మళ్ళీ పెద్దాయన ఏం పేచీ పెట్టుకుంటాడో అని.. కానీ ఆయన 'ఈ చరిత్ర ఏ సిరాతో' చూసానయ్యా, కారల్ మార్క్స్ దాస్ కాపిటల్‌ని తెరకి దింపారు!

"కనుబొమ్మ క్రిందకి దిగితే వినయం.. పైకి లేస్తే విప్లవం.." అని ఇంత అద్భుతంగా రాసిన ఆ కలం, అలాంటి బూతులు ఎలా రాసిందయ్యా?" అని మళ్ళీ చివాట్లు వేసారు.

ఆ తరువాత మా అనుబంధం, ఆయన బ్రతికున్నంతకాలమూ 'బాబాయ్' అని నా చేత ఆయన్ని పిలిపించింది. ఆయన 'అబ్బాయ్' అని ప్రేమగా పిలిచేవారు. మొదటిసారి 2004లో బ్రదీనాథ్ కథా చర్చలు జరుగుతున్నప్పుడు నేను అమెరికా వెళ్ళాల్సి వచ్చింది. అల్లురామలింగయ్యగారు 'పెద్ద సినిమా పెట్టుకుని ఎలా వెళ్తావ్? ఒద్దు' అన్నారు. కానీ అరవింద్ గారు "నెల రోజులేగా.. ఏవీ కాదు! వెళ్ళి వచ్చేసెయ్యండి" అన్నారు. సరిగ్గా నేను అమెరికాలో ఉన్న రోజుల్లోనే ఆయన పోయారు. నేను అక్కడ ఈ వార్త విని ఎంతో ఏడ్చాను. ఒక రక్త సంబంధీకుడిని పోగొట్టుకున్నట్లు బాధపడ్డాను.

తిరిగి రాగానే "నెలరోజుల్లో ఏవీకాదు వెళ్ళి రమ్మన్నారు.. నేను తిరిగి వచ్చేసరికే మా బాబాయ్‌ని పోగొట్టుకున్నాను.." అని అరవింద్ గారిని కన్నీళ్ళతో అడిగాను.. " అని ఎంతో ఆర్ధ్రతతో పరుచూరి గోపాల కృష్ణగారు ఈ మాటలు చెప్పారు.

ప్రముఖ దర్శకులు శతచిత్ర దర్శకులూ కోడిరామకృష్ణగారు అయితే రెట్టించిన ఉత్సాహంతో ఆయన గురించి చెపుతూ ఉంటారు.

"అల్లురామలింగయ్యగారు మా పాలకొల్లుకే గర్వకారణం. ఆయన పినిశెట్టిగారు రాసిన 'ఆడది' అనే నాటకం ఆడి అందులో ప్రధాన పాత్ర వేసేవారు. నేను అందులో హీరో వేషం వేసేవాడిని. అల్లుగారి రెండో అబ్బాయి వెంకటేశ్వరరావు కూడా నటించేవాడు. అతను మెడిసన్ చదువుతూ ఉండగా దురదృష్టవశాత్తూ ఒక రైలు ప్రమాదంలో మరణించాడు. లేదా ఒక మంచి నటుడిగా తెలుగు తెరమీద ఎంతో గుర్తింపు తెచ్చుకునేవాడు. ఆ రోజుల్లో ఆయన మా అందరికీ 'తియ్యని మాత్ర'లు ఇస్తుండేవారు. ఫ్రీడమ్ ఫైటర్‌గా ఓసారి 'క్విట్ ఇండియా' మూమెంట్‌లో అరెస్ట్ అయారుట. ఆ కబుర్లు చెపుతుంటే మా కెంతో థ్రిల్లింగ్‌గా ఉండేది. నేను ఇండస్ట్రీకి హీరోని అవుదామని వచ్చాను. నేను మద్రాస్‌లో కాలు మోపడానికి ఆయనే కారణం. నా గురించి అల్లురామలింగయ్యగారు రాసిచ్చిన రికమెండేషన్ లెటర్ ఇప్పటికీ దాచి పెట్టుకున్నాను. ఆయన ఎప్పుడూ తన భార్య కనకరత్నం గారి సహకారం తన ఎదుగుదలకీ, కుటుంబాన్ని చక్కదిద్దుకుంటూ ఆవిడ చూపిన ఓర్పు, పిల్లల భవిష్యత్తుకీ ఎంతో సాయపడిందని చెప్పేవారు. ఆయనకి ఇద్దరు మగపిల్లలూ, ముగ్గురు ఆడపిల్లలు. అరవింద్ బాబు, వెంకటేశ్వరరావు, జయభారతి, వసంత, సురేఖ.

ఆ రోజుల్లో సినిమా హిట్ అవ్వాలంటే ఖచ్చితంగా రావుగోపాలావు గారి పక్కన అల్లురామలింగయ్యగారు ఉండాల్సిందే! ఆయన 'కటింగ్' ఎవరికీ రాదు. ఓ చిన్న కుదుపు, మూతీ, మెడా విరుపూ, చెయ్యి ఎత్తి కొట్టడం నుండీ, నడక దాకా ఆయనకంటూ ఓ ప్రత్యేకమైన స్టైలు ఉన్న విలక్షణ నటుడు ఆయన. ఆయన వైద్యం చేస్తే పెరాల్సిస్‌లో చచ్చుబడిన చెయ్యికూడా పైకి లేపగలిగేవారు! ఓసారి ఎన్.టి.రామారావుగారితో గొడవ పెట్టేసుకున్నారు. ఈయన సెట్లో ఉండగా సాధారణంగా ఎవరికి తుమ్మొచ్చినా, దగ్గొచ్చినా, లేదా ఇంకా పెద్ద వ్యాధి అయినా సరే తప్పకుండా వైద్యం చేసి తరువాత గుణం కనుక్కునేవారు. ఓసారి నటరత్న నందమూరి తారకరామారావుగారికే వైద్యం చేసేసారు. మూడు నెలలు, రోజుకి మూడు మాత్రలు చప్పున వేసుకోమని ఇచ్చి వెళ్ళారు. తరువాత మూడు నెలలు గడిచాకా, "ఏవండీ.. మందులు వేసుకున్నారా? ఎలా ఉందీ?" అని అడిగితే, ఆ మహానటుడు " ఆరోజే వేసేసుకుంటిమి కదా! మీరు ఇచ్చినవి అన్నీ" అన్నారుట.

ఈయన "ఏవిటి? అన్నీనా?" అని అడిగితే,

"అన్నీ వేసుకున్నాం బ్రదర్" అన్నారుట.

ఈయన తల బాదుకుని "మీకు ఏమైనా అయితే ఈ ఆంధ్ర రాష్ట్రం మొత్తం వచ్చి నన్ను చంపేస్తారు.. ఎందుకండీ అలా చేసారు? ఇప్పటి నుండీ నేను వైద్యం చెయను" అంటే,

ఆయన తప్పు తెలుసుకుని "అలాగే .. మీరు చెప్పినట్లే చేస్తాం.. కోపం వద్దు" అని అప్పటి నుండీ ఆయన చెప్పిన ప్రకారం మందులు వేసుకునేవారట.

నా సినిమా 2000లో తీసిన 'దేవుళ్ళు'లో కూడా ఉన్నారు. ఆయన నటించడం కోసమే పుట్టినట్లు ఉండేవారు. స్క్రిప్ట్ వర్క్ జరుగుతున్నప్పుడే "నాకు ఏమైనా ఉందా లేదా?" అని ఫోన్ చేసేవారు. చివరివరకూ నటనలో జీవితం గడపాలనీ, ఎవరి 'తాలూకు'గానో ఆయన పేరు చెప్పుకోకూడదనీ ఆయనకి ఉండేది.

'దేవుళ్ళు' షూటింగ్‌లో ఒక సాంగ్ షూట్ చేస్తున్నాం. ఆ సాంగ్ బిట్‌లో ఈయన ఉన్నారు. కొన్ని బిట్లు చేసేసరికే చాలా రాత్రి అయిపోయింది. ఇంకో బిట్‌లో ఈయన ఉన్నారు. కానీ రాత్రి రెండు అయిపోయేట్లుంది. అందుకే నేను "మీరు పెద్దవారు, వెళ్ళి

పడుకోండి.. అది నేను మేనేజ్ చేస్తాను" అన్నాను. ఆయన ఒప్పుకోలేదు "అందులోనూ నేను ఉండాలి" అన్నారు. సెట్లో మంచం తెప్పించుకుని పడుకుని, మళ్ళీ రెండుకి నిద్రలేచి, ఫ్రెష్‌గా ఆ డాన్స్ బిట్ చేసారు. మొదటి చిత్రం నుండీ నటించిన చివరి చిత్రందాకా అదే టెంపో మెయిన్ టెయిన్ చెయ్యడం ఆయనకే చెల్లింది. ప్రతి చిత్రంలో వైవిధ్యం చూపేవారు. అందుకే ప్రతి చిత్రంలో విధిగా ఆయన మీద ఒక సాంగ్ చిత్రీకరణ జరిగేది. ఎన్.టి.ఆర్, ఏ.ఎన్.ఆర్ లాంటి అతిరధ మహారధులిద్దరు నటిస్తున్న 'శ్రీ కృష్ణార్జున యుద్ధం' సినిమాలో 'అంచెలంచెలు లేని మోక్షం ఏమి లాభమె భామినీ' అని నాగేశ్వరరావుగారి సావాసగాడుగా ఉండే ఈయనకి పాట పెట్టారంటే చూడండి! అలాగే మా గురువుగారు 'దాసరి నారాయణవుగారి' సినిమా 'మనుషులంతా ఒక్కటే'లో 'ముత్యాలూ వస్తావా? అబ్బ.. అడిగిందీ ఇస్తావా' అనే పాటా, ఆ పాటకి ఈయన చేసిన అభినయం ఆంధ్ర రాష్ట్రం మొత్తాన్ని నవ్వులతో ఊపేసిందంటే అతిశయోక్తి కాదు. ఆ రోజుల్లో పాత్రకి తగ్గ పేర్లు ఉండేవి. ఈయన పేరు 'నర్తనశాల'లో 'వాల' అంటే తోక! ఉత్తరకుమారుడికి తోకలా ఉండే పాత్ర అని అర్ధం.

'ఉమ్మడి కుటుంబం'లో పంచె చిరిగిపోతే, చాట అడ్డం పెట్టుకుని వెళ్ళడం, 'మూగమనసుల్లో' 'ఆకలేత్తోంది..' అనే ఆ మాడ్యులేషన్... ఇక శంకరాభరణం, సప్తపదిలో ఆ పరిణితితో కూడిన నట కౌశలం, ఆ ప్రతిభా మూర్తికే అబ్బిన విద్యలు.

ప్రముఖ రచయితా, సినీ నటులు గొల్లపూడి మారుతీరావుగారి మాటల్లో అల్లురామలింగయ్యగారి గురించి ఇలా చెప్పారు "సాధారణంగా కొన్ని వందల సినిమాల్లో నటించే నటుల్లో మొనాటనీ వస్తుంది. హస్యానికి ఇంకా ఎక్కువ మొనాటనీ వస్తుంది. ఎందుకంటే, సినిమా పోయినా హాస్యం గుర్తుంచుకుంటారు కనుక. లారెల్ అండ్ హార్డీ, నల్ల రామ్మూర్తి, రాజబాబూ, పద్మనాభం ఎవరైనా సరే.. కొంతకాలానికి మొనాటనీ వస్తుంది. వాళ్ళు వేసిన పాత్రలు తలుచుకున్నప్పుడు, ఆ నటులు గుర్తుకు వస్తారు. కానీ.. దీనికి విరుద్ధంగా అల్లురామలింగయ్యని తలుచుకున్నప్పుడు పాత్రలే గుర్తుకు వసాయి. ఒక ముత్యాల ముగ్గులో జోగినాధం, అందాల రాముడిలో తీసేసిన తాశిల్దారూ, శంకరాభరణంలో లాయరూ, సప్తపదిలో రాజుగారూ.. ఇలా వందల పాత్రలు.. దశాబ్దాలుగా... వేసినా మొనాటనీ రాని ఏకైక కమేడియన్ అల్లురామలింగయ్య. ఎందుకంటారా? ఆయన పాత్రల్లోకి పరకాయ ప్రవేశం చేసాడే కానీ, ఆయనలోకి పాత్రని రానివ్వలేదు!



ఆయనకి పద్మశ్రీ వచ్చినప్పుడు నేను ఓ ఆర్టికల్ రాసాను ఆయన గురించి, అది మర్నాడు పేపర్లలో వచ్చినపుడు మా పిల్లలు "అల్లురామలింగయ్యగారికి ఫోన్ చెయ్యండి" అన్నారు. "ఆయనకి నేను ఫోన్ చెయ్యడం కాదు.. ఆయన చెయ్యాలి" అన్నాను. పది నిమిషాల్లో ఫోన్ మోగింది. అల్లురామలింగయ్యగారు "గొల్లపూడి ఉన్నారా?" అని అడిగారుట. పనివాడు "ఉన్నారు సార్ పిలుస్తాను" అన్నాడు. ఆయన ఫోన్ పెట్టేసారు. ఇంకో పదినిమిషాల్లో మా ఇంటికొచ్చారు. నన్ను కౌగిలించుకున్నారు. ఆ తర్వాత ఆ ఆర్టికల్ కాపీలు తీసి ఎంతో మందికి పంచి పెట్టారట ఆయన." అని ఆ తియ్యని జ్ఞాపకాన్ని గుర్తుకు తెచ్చుకున్నారాయన.

అల్లురామలింగయ్యగారు ఎక్కువ వేషాలు వేసి అనునిత్యం యూనిట్‌లో గడపాలనుకునేవారు. ఎవరైనా ఇంకా పారితోషికం పెంచి తక్కువ వేషాలు వెయ్యొచ్చుగా అన్నప్పుడు, "ఇప్పుడు పాలకొల్లు వెళితే పొగాకు కూడా అమ్ముకోలేను. నాకు ఈ ఇండస్ట్రీ ఇంత పని ఇచ్చింది. సంతోషంగా ఉన్నాను. ఎందుకు డబ్బులు పెంచి ఆత్మీయతలు తగ్గించుకోవాలీ" అనేవారట. అంతమంచి మనసు కాబట్టే ఆయన పిల్లలంతా పైకొచ్చారు. అరవింద్ గారు సౌత్ ఇండియాకే ప్రైడ్ తెచ్చిపెట్టిన మెగా ప్రొడ్యూసర్, పెద్ద అల్లుడు డా.వెంకటేశ్వర రావుగారు వైద్యులేగాక ప్రొడ్యూసర్ కూడా. చిన్న కుమార్తె సురేఖ ఎవరో కాదు అందరికీ తెలిసిందే 'మెగాస్టార్' చిరంజీవి అర్ధాంగి. ఆయన మనవలు అల్లు అర్జున్, కొణెదల రామ్ చరణ్ కూడా పెద్ద హీరోలయ్యారు.



ప్రముఖ సినీ రచయిత సత్యానంద్ గారు కొన్ని అనుభవాలు ఇలా పంచుకున్నారు. "ఆయన తెరమీదే కాదు, నిజ జీవితంలో కూడా ఎంతో సెన్స్ ఆఫ్ హ్యూమర్ ఉన్న వ్యక్తి. నాకు నా 'ఊర్వశి' చిత్రం, క్రాంతికుమార్‌గారు డైరెక్ట్ చేసిన రోజుల నుండీ ఈయన పరిచయం. ఆ తరువాత ఆయన కుటుంబంతో నాకు ఆత్మీయత అనుబంధం ఏర్పడింది.

నేను ఏ కథకి పనిచేస్తున్నా, ఈయన వేషం అడిగేవారు. ఆయన ఫోన్ అంటే 'లేనని' చెప్పిస్తానేమోనని, చెప్పా పెట్టకుండా డైరెక్ట్‌గా వచ్చేసేవారు. నా అసిస్టెంట్ లేచి నిలబడితే, వాడిని మాట్లాడొద్దని సైగ చేసి, రకరకాల విచిత్రమైన వాయిస్‌లతో మాట్లాడేవారు. ఆ గొంతులు ఎవరివా అని బయటకొస్తే ఈయన ఉండేవారు! ఒక్కోసారి ఈయన వచ్చే టైంకి నేను తలుపు వేసుకుని, బజ్జర్ మోగితే, "పీప్ హోల్"లో నుండి చూసి తలుపు తెరుద్దామంటే, ఏవీ కనపడేది కాదు! అంతా చీకటిగా ఉండేది. తీరా తెరిస్తే అరచెయ్యి దానికి అడ్డుగా పెట్టి నవ్వుతూ ఈయన కనిపించేవారు! అసలిదంతా ఎందుకంటే.. 'అల్లురామలింగయ్యగారి అబ్బాయి అరవింద్ నాకు మంచి మిత్రుడు. అతను ఈయన పెద్దవయసొచ్చాక, ఆరోగ్యం బాగాలేదని, నటన మానెయ్యమన్నాడు. ఈయన వినలేదు. ఆయన మాతోనే డైరెక్ట్‌గా 'మా నాన్నకి వేషం లేదనండి.. ఆయనకి అన్నీ ఇస్తున్నాం.. హాయిగా రిలాక్స్ అయి ఎంజాయ్ చెయ్యమనండి' అనేవారు. అందుకని మేం "మీకేం రాయడం లేదు. మీకు ఈ సినిమాలో వేషం లేదు" అంటే, "ఏవిటి? మా వాడు ఒద్దన్నాడా? వాడు ఎవడు చెప్పడానికి? నేను సినిమాలు తియ్యద్దు అంటే వాడు వింటాడా?" అని కోప్పడేవారు.

యుక్తవయసులో ఉన్నప్పుడు కుర్రాళ్ళకి స్టైలుగా సిగరెట్ తాగడం, అలా తాగేటప్పుడు తాము ఎలా ఉంటామో ఊహించుకోవడం సరదాగా ఉంటుంది. ఓసారి అరవింద్ అలాగే తను సిగరెట్ తాగేటప్పుడు ఎలా ఉంటానో చూసుకోవాలనుకుని, అద్దం ముందు నిలబడి సిగరెట్ తాగుతుంటే, వెనక నుండి ఒక చెయ్యి వచ్చి అతని చెంప పగలకొట్టిందట, ఆ చెయ్యి అల్లు రామలింగయ్యగారిది! అప్పుడు అరవింద్‌కి సిగరెట్ తాగుతుంటే తన చెంప వాయగలదనీ, ఏడుపు వస్తుందనీ అర్ధమైంది" అని తనదైన చమత్కారంతో సత్యానంద్ గారు అల్లు రామలింగయ్యగారితో ఉన్న తన అనుబంధం చెప్పారు. ఆయనే ఇంకో తమాషా విషయం కూడా చెప్పారు. అల్లురామలింగయ్యగారికి హమేషా తనతో ఒక కాళ్ళు వత్తే మనిషిని ఉంచుకోవడం అలవాటు షూటింగ్ గ్యాప్స్‌లో వాడు ఈయన కాళ్ళు వత్తుతూండేవాడు. అది బాగా అలవాటుగా మారింది. ఓసారి వాడు ఊరెళ్ళాడు. కానీ ఈయనకి షూటింగ్‌లో ఎవరో ఒక రీజన్‌బుల్ పెద్ద మనిషిలా కనిపిస్తున్న వ్యక్తి కాళ్ళు పడుతూ కనిపించాడు. నేను దగ్గరకెళ్ళి పలకరించి, ఆ వ్యక్తి కాళ్ళు పట్టి వెళ్ళిపోయాక "మీ రెగ్యులర్ కాళ్ళు పట్టే కుర్రాడు వచ్చినట్లు లేదు.. ఇతనెవరూ?" అని అడిగాను.

"ఏమో! నమస్కారం.. అని దగ్గరకొచ్చాడు.. కాళ్ళు పట్టించుకున్నాను" అన్నారు.

"అదెలా?" అని ఆశ్చర్యంగా అడిగాను.

"ఏవుందీ.. సింపుల్.. అతను నమస్కారం అని దగ్గరకి రాగానే, కూర్చోమని, "మీ కాళ్ళు నెప్పులుగా ఉన్నాయా.. చాలా దూరం నుండి వచ్చినట్లున్నారూ?" అని అడిగాను.

అతను "అబ్బే.. లేదు" అన్నాడు మొహమాటంగా.

"ఊరికే అంటున్నారు. ఉండే ఉంటాయి.. ఇలా పెట్టండి.. నేను పడతాను.. మనిషికి మనిషి కాళ్ళు పడితే ఏమీ తప్పులేదు. నాకు నెప్పులుగా ఉన్నాయి అంటే మీరు పట్టరూ?" అంటూ ఆ పెద్దమనిషి కాళ్ళు లాక్కుని బలవంతంగా ఈయన పిసికి, ఆ తరువాత ఆ పెద్దమనిషి ఒళ్ళో తన కాళ్ళు పెట్టి పిసికించుకున్నారట!" అని చెప్పి నవ్వారు. అంతేకాదు.. ఆయన తన అభిప్రాయం ప్రకారం

'అల్లురామలింగయ్యగారి హాస్యం అంతకాలం ఆంధ్రలోకాన్ని అలరించడానికి కారణం ఆయనలో ఉన్న ఇన్నోసెన్స్' అని చెప్పారు! అదే ఆయన కొడుకులలో ఇంటిలిజెంట్ హాస్యం ఉంటుంది. ఆయన హాస్యంలో స్వచ్ఛతా, అమాయకత్వం ఉంటే, అరవింద్ హాస్యంలో విజ్ఞానం, వివేకం ఉంటాయన్నారు. అందుకే చార్లీచాప్లిన్ లాంటి హాస్యనటులు అంత ప్రముఖులయ్యారు. వారిది పసిపాపల్లాంటి మనస్తత్వాలు!

నేను రాసే సినిమాల్లో రావుగోపాలరావుగారికీ, అల్లురామలింగయ్యగారికీ కాంబినేషన్ సీన్లు ఎక్కువగా పడేవి. రావుగోపాలరావు గారు "ఈయనకి డైలాగ్‌లు ఎక్కువ రాయొద్దండీ.. డైలాగ్‌తో మార్కులు కొట్టేస్తాడు' అని మొత్తుకునేవారు. అలా అని డైలాగులు రాయకపోతే, డైలాగ్ లేని సీన్‌లో కూడా, ఈయన కెమేరా పెట్టగానే, గోపాలావు గారి వెనకనుండో, తలమీదుగానో, ఎక్స్‌ప్రెషన్స్ ఇస్తుంటే, సెట్‌లో అంతా ఘొల్లున నవ్వుతుండేవారు! గోపాలావు గారు తన డైలాగ్‌కే అంతా నవ్వుతున్నారు అనుకునేవారు. తరువాత సీన్ చూసాక "ఈయన్ని అసలు వెనక పెట్టద్దయ్యా.. డైలాగ్ ఉన్నా లేక పోయినా కొట్టేస్తున్నాడూ" అనేవారు. అలా ఒక ఎక్స్‌ప్రెషన్‌తో తోటి నటులందరినీ డామినేట్ చేస్తుండేవారు, " అని సత్యానంద్ గారు అల్లురామలింగయ్యగారితో కొన్ని అనుభవాలు జ్ఞాపకం చేసుకున్నారు.

ఈ సినీ ఉద్యానవనంలో ఆ మహానుభావుడి వల్ల ఎందరో నటులు 'మొక్కలుగా' వచ్చి శాఖోపశాఖలుగా విస్తరించారు. ఆయన కళామతల్లికి చేసిన సేవలూ, దేశానికి చేసిన సేవలలు కన్నా పెద్ద విరాళాలు, ఆయన మనవలు కూడా ఈ పరిశ్రమలో హీరోలు అవడం. ఆ కుటుంబం నిండా హీరోలే! కానీ ఈయన నిజమైన కామెడీ 'కింగ్'. రియల్ 'స్టార్'!

2001 లో ప్రతిష్ఠాత్మకమైన రఘుపతి వెంకయ్య అవార్డు దక్కించుకున్నారు. 1990 లో భారత ప్రభుత్వం 'పద్మశ్రీ' అవార్డుతో సత్కరించింది. 'హాస్య కళాప్రపూర్ణ' అని ప్రజానాట్యమండలి వారు బిరుదిచ్చారు. ఈ మధ్యే వైజాగ్ బీచ్ దగ్గర ఆయన విగ్రహాన్ని ప్రతిష్ఠించారు.

ఆయన రెండవ కుమారుడు అల్లు వెంకటేశ్వరరావుగారు అకాల మరణం పొందకుండా ఉండి ఉంటే, తండ్రిలా మంచి నటుడై ఉండేవారో, అన్న అరవింద్ గారిలా పెద్ద నిర్మాత అయి ఉండేవారో కానీ, దేశానికి ఒక వైద్యుడిగా తప్పక సేవలు అందించేవారు! ఎందుకంటే, వైద్యరంగం అంటే ఆ కుటుంబానికి ఎనలేని మక్కువ. పేదలకీ, రోగులకీ సేవలు అందించడానికే అల్లురామలింగయ్యగారి ప్రోత్సాహంతో 'చిరంజీవి చారిటబుల్ ట్రస్ట్' ఇంకా ' చిరంజీవి ఐ బ్యాంక్' స్థాపించారు.

రాత్రీ పగలూ రక్తం కోసం వెళ్ళే రోగులకి, రక్తదానం, నేత్రదానం చేస్తున్న ఆ సంస్థ ఎందరికో జీవితాన్నీ, కొందరికి 'చూపునీ' ప్రసాదిస్తోంది.

అల్లురామలింగయ్యగారు 2004 లో జూలై 30 న తన నవ్వులు పంచడానికి ఇక తిరిగిరాని పయనంతో పుణ్యలోకాలకి సాగిపోయారు. ఆయన మరణాంతరం ఆ 'నవ్వులు వెలిగించే దివ్య జ్యోతులు' లాంటి కళ్ళు 'చిరంజీవి ఐ బ్యాంక్' ద్వారా, ఇంకో ఇద్దరు మనుషులకి బ్రతుకుల్లో చీకటి పారద్రోలి 'దృష్టి'ని ప్రసాదించాయి.

హాస్యం ఉన్నంత వరకూ ఆయన చిరంజీవి!

ఆయన పుట్టినరోజు అయిన ఈ అక్టోబర్ 1.. మన అందరికీ 'నవ్వు'గుర్తు చేసే రోజు!

అందరూ నవ్వాలి! హాయిగా ఉండాలి!

**NEW**
Click here to share your comments on this story